www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి
భద్రాద్రి
బుధవారం | 04 | నవంబర్ | 2026
పేజీలు : 8

మురసుతో రోజంతా ముసురు

-ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు



ప్రజాపక్షం/ ఖమ్మం : అర్నబ్ తుఫాన్‌తో అంతగా వర్షం రాకపోయినా మురసు తుఫాన్ మాత్రం రైతులను ఆదుకుంది. ఎల్‌నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వరి, ఇతర పంటలకు నష్టమే అయినా రైతులు వర్షాన్ని స్వాగతించారు. మురసు కారణంగా మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా వేంసూరులో 52 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఎర్రుపాలెంలో 25.8, సత్తుపల్లిలో 43, మధిరలో 29.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. కరువు మండలంగా ప్రకటించని తిరుమలాయపాలెంలో మాత్రం 1.8 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. రోజంతా చినుకులు పడుతుండడంతో జన జీవనం స్తంభించింది. సామాన్యులు ఇబ్బందులు పడ్డారు. మొత్తంగా వర్షం రైతుల్లో ఆశలు నింపింది. కోతకు వచ్చిన వరి పొలాలకు కొంత మేర నష్టం వాటిల్లింది.

తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

-తక్షణం కరువు నివారణ నిధులు విడుదల చేయాలి
-రుణాలను రీ షెడ్యూల్ చేయాలి.. ఉపాధి పనులు చేపట్టాలి
-నిత్యావసరాల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి
-కూనంనేని డిమాండ్
-కరువు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన సిపిఐ బృందం





ప్రజాపక్షం/ కొణిజర్ల : తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనతో సరిపుచ్చుకోకుండా తక్షణం కరువు నివారణ చర్యలకు నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. మంగళవారం ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలంలో తనికెళ్ల, కొణిజర్ల తదితర కరువు ప్రభావిత మండలాల్లో సిపిఐ బృందం పర్యటించింది. సాగు చేయని పొలాలు, నీటికి నోచుకోని చెరువులను, అధిక ఉష్ణోగ్రతల కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. పలు చోట్ల అడుగంటిన భూగర్భ జలాల స్థితిని తెలుసుకోవడంతో పాటు రైతులను కరువు పరిస్థితిపై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనికెళ్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ తక్షణం రూ. 25వేల కోట్లను కేంద్రం నిధులు విడుదల చేయాలని అప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం కరువు పనులు కొనసాగించేందుకు తన వంతు నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. కరువుకు సంబంధించి పరస్పర ఆరోపణలు చేయకుండా సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రకృతి విపత్తు కారణంగా ఏర్పడిన ఈ పరిస్థితిని అధిగమించేందుకు అన్ని పార్టీలు కృషి చేయాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ఎల్‌నినో కారణంగా లోటు వర్షపాతం నమోదైందని చెరువులు, కుంటలకు నీరు చేరలేదని రైతులు వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు వేయకపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గిందని కూనంనేని తెలిపారు. రాష్ట్రంలో గతేడాది

మిగతా 2లో..

సిసిఐ కేంద్రం ఏదీ?
దళారుల చేతుల్లో పత్తి రైతులు!



ప్రజాపక్షం/కారేపల్లి : పత్తి కొనుగోలు కేంద్రం అందుబాటులో లేకపోవడంతో కారేపల్లి మండల రైతులు దళారుల చేతుల్లో నష్టపోతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడాన్ని అవకాశంగా మలుచుకుంటున్న కొందరు వ్యాపారులు గ్రామాల్లోనే తక్కువ ధరకు పత్తి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు, అవసరమైన అనుమతులు లేకుండానే కొనుగోళ్లు సాగుతున్నా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

-కారేపల్లిలో బహిరంగంగా కొనుగోళ్లు
-లైసెన్సులపై ఆరోపణలు
-మార్కెటింగ్ శాఖ పర్యవేక్షణ ఏదీ?

వరంగల్ లైసెన్సులతో కారేపల్లిలో కొనుగోళ్లా..?

కారేపల్లి మండలంలో పత్తి కొనుగోళ్లు చేస్తున్న కొందరు వ్యాపారులు వరంగల్ ప్రాంతంలో పొందిన లైసెన్సుల పేరుతో ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొనుగోళ్లకు సంబంధించిన అనుమతులు, చలానాల

మిగతా 2లో..

రాజకీయాలకతీతంగా
ఇందిరమ్మ ఇండ్లు



ప్రజాపక్షం/ ఖమ్మం/ తిరుమలాయపాలెం : రాజకీయాలకు అతీతంగా పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇండ్లు పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అన్నారు. మంగళవారం కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి తిరుమలాయపాలెం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా

-రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం
-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

దమ్మాయిగూడెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్

మిగతా 2లో..

తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలి







(మొదటిపేజీ తరువాయి)

ఖరీఫ్‌లో 69.19 లక్షల ఎకరాలలో వరి సాగు చేస్తే ఈఏడాది 57.04 లక్షల ఎకరాలలో మాత్రమే వరి సాగు చేశారని అది కూడా దిగుబడి పలు చోట్ల తగ్గుతుందన్నారు. ఒక వరి విస్తీర్ణమే 12.15 లక్షల ఎకరాలు తగ్గిందని ఈ దశలో పంటలు సాగు చేయని రైతులను కూడా ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కరువుపీడిత గ్రామల్లో పరిశీలన చేయాలని, పరిహారానికి తక్షణం చర్యలు చేపట్టాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. రుణాలను రీ షెడ్యూల్ చేయాలని రెండు లక్షల రుణమాఫీ కానీ రైతుల రుణాలను ఇప్పుడు మాఫీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుత పరిస్థితుల రీత్యా తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని దీనిని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. పంచాయతీలకు ప్రత్యేక కరువు నిధులను కేటాయించాలని వి బి జీ రాంజీ పథకం ద్వారా పనులు చేపట్టడంతో పాటు పని దినాల సంఖ్యను పెంచాలన్నారు. కూలీ కూడా గిట్టుబాటు అయ్యేవిధంగా చూడాలన్నారు. పశుగ్రాసం కొరత రాకుండా చూడడంతో పాటు చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడేవిధంగా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. ప్రత్యేకించి కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, వరికి రూ. 30వేలు, వాణిజ్య పంటలకు రూ. 50వేలు పరిహారంగా అందించాలని ఆయన కోరారు. నిత్యావసర వస్తువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించి ప్రజలపై భారాలు మోపుతున్నారని తక్షణం బ్లాక్ మార్కెట్ దారులపై చర్యలు తీసుకోవాలని, 14 రకాల నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా సరఫరా చేయాలన్నారు. ప్రస్తుత పంటలను కాపాడేందుకు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించాలని ఆయన కోరారు. మీడియా సమావేశంలో రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు దొండపాటి రమేష్, రైతు సంఘం నాయకులు రవీంద్రబాబు, మిడికంటి వెంకటరెడ్డి, తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి గడల భాస్కర్ పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు

(మొదటిపేజీ తరువాయి)

చెక్కులను సైతం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రెండవ విడత 187 మంది లబ్ధిదారులకు ఇండ్లను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి ఉచితంగా రూ. 5లక్షలతో ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి దశలో తిరుమలాయపాలెం మండలానికి 810 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా ఇప్పటికే 700 ఇండ్లు పూర్తయ్యాయన్నారు. కుల, మత రాజకీయ వ్యత్యాసం లేకుండా పేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చుతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత విద్యుత్ , సన్న బియ్యం, ఉచిత బస్సు, రెండు లక్షల రుణమాఫీ తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించామని, మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించామని తెలిపారు. రానున్న కాలంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ఘన విజయం సాధించి రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కాబోతున్నారని మంత్రి పొంగులేటి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పాలన ఎలా ఉందో ఇక రాష్ట్ర మంతా ఇదే రీతిగా సాగనుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఏలువారిగూడెంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు బీరోలులో రూ. 48 లక్షలతో నిర్మిస్తున్న ఓహెచ్‌ఎస్‌ఆర్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు శేఖర్ రెడ్డి, వెంకటరెడ్డి, భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డివో ఎన్. శ్రీనివాస్, ఎండివో శిలారుసాహెబ్, తహసీల్దార్ విల్సన్, కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, సామా శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ నల్లమల కీర్తి పాల్గొన్నారు.

సిసిఐ కేంద్రం ఏదీ? దళారుల చేతుల్లో పత్తి రైతులు!





(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారంపై స్పష్టత లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని రైతులు కోరుతున్నారు.

సీపీఐ కేంద్రం లేక రైతుల ఇక్కట్లు...!

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం కాకపోవడంతో పంటను ఎక్కడ విక్రయించాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడి కోసం చేసిన అప్పుల తీర్చాల్సి ఉండటం, పంట చేతికొచ్చిన సమయంలో నగదు అవసరం ఏర్పడటంతో తక్కువ ధరకు పత్తిని విక్రయించాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. సీపీఐ కొనుగోలు చేయడం లేదంటూ దళారులు ప్రచారం చేస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని వారు అంటున్నారు.

తనిఖీలు చేపట్టాలని డిమాండ్...!

గ్రామాల్లో బహిరంగంగా కొనుగోళ్లు జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ ఎందుకు స్పందించడం లేదని రైతులు, ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు. వ్యాపారుల లైసెన్సులు, కొనుగోళ్లకు సంబంధించిన చలానాలు, అనుమతులను పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలు తేలితే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే స్పందించి కారేపల్లి మండలంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

లైసెన్స్ తప్పని సరి : మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీం

ఈ ఆరోపణలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీంను ప్రజాపక్షం వివరణ కోరగా పత్తి, ధాన్యం, మిర్చి, మొక్కజొన్న తదితర పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి తప్పని సరిగా లైసెన్స్ తీసుకోవాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా కొనుగోళ్లు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వ్యాపారులు లైసెన్స్ కోసం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. అనుమతులు లేకుండా ఎవరైనా కొనుగోళ్లు చేస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

రైసుమిల్లర్లపై అధికారుల దాడులు

-ఎగవేతదారులపై పోలీస్ కేసులు -కొత్తగూడెంలో కాంగ్రెస్ నేతపై కేసు నమోదు

ప్రజాపక్షం/ ఖమ్మం/ కొత్తగూడెం : ధాన్యం విషయంలో తెలంగాణ ప్రభుత్వం మిల్లర్ల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంది. సిఎంఆర్ ధాన్యాన్ని తీసుకుని ప్రభుత్వానికి తిరిగి బియ్యం ఎగమతి చేయకుండా ప్రైవేటుకు విక్రయించిన అనేక మంది మిల్లర్ల బాగోతం ఒక్కొక్కటిగా బయటపడుతుంది. గతంలో అనేక మంది మిల్లర్లు వందలాది మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎగవేసి దర్జాగా వ్యాపారం నిర్వహించుకున్నారు. గతేడాది ఉమ్మడి ఖమ్మంజిల్లాలో నమోదైన కేసులు సంచలనం సృష్టించాయి. ఈ ఏడాది కూడా పౌర సరఫరాల శాఖాధికారులు సిఎంఆర్ ధాన్యం తీసుకుని లేవిని విస్మరించిన మిల్లులపై దాడులు చేస్తున్నారు. కొత్తగూడెంలో ఒక మిల్లర్‌పై కేసు కావడం చర్చనీయాంశమైంది. ఆయన కాంగ్రెస్ నాయకుడు కావడంతో కేసు నమోదు చేసేందుకే పోలీసులు తీవ్ర జాప్యం చేశారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కొత్తగూడెం మేదరబస్తీలోని రైసుమిల్లుకు సంబంధించి సుమారు ఏడు కోట్ల విలువైన ధాన్యాన్ని అక్రమంగా పక్కదారి పట్టించినట్లు నిర్ధారించిన సివిల్ సప్లయ్ అధికారులు ఆళ్ల మురళీతో పాటు ఆయన వ్యాపార భాగస్వామిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆళ్ల మురళీ ఒక మంత్రికి ప్రధాన అనుచరుడిగా, కాంగ్రెస్ పార్టీకి నాయకునిగా ఉన్నారు. ఈ కేసు నమోదు చేసేందుకు పోలీసులు సుముఖత వ్యక్తం చేయకపోవడంతో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు సమాచారం. మొత్తంగా సివిల్ సప్లయ్ అధికారుల వరుస దాడులతో అక్రమార్కుల్లో భయం మొదలైంది.

భక్తిశ్రద్ధలతో ఘనంగా సమాధుల పండుగ

ప్రజాపక్షం/ఇల్లెందు: పరలోకానికి వెళ్లిన కుటుంబ సభ్యులు, బంధువులను స్మరించుకుంటూ క్రైస్తవులు నిర్వహించే సమాధుల పండుగను ఇల్లందులో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని బందెల మల్లయ్యకుంట ప్రాంతంలో ఉన్న సమాధుల వద్ద సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా సమాధులను వివిధ రకాల పూలు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. పిల్లాపాపలతో కుటుంబ సభ్యులు సమాధుల వద్దకు చేరుకుని తమ ఆత్మీయులను స్మరించుకున్నారు. స్మశానవాటిక విద్యుత్ దీపాల వెలుగులతో ప్రశాశించింది. పలువురు పట్టణ ప్రముఖులు కూడా ప్రార్థనల్లో పాల్గొని పరలోకానికి వెళ్లిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సీఎస్ఐ చర్చి పాస్టరేట్ చైర్మన్ రెవరెండ్ దైవ ప్రతాప్, బి రాజేంద్ర బాబు, చర్చి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. చర్చి సంఘ పెద్దలు, మహిళలు, సంఘ సభ్యులు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వేపలగడ్డలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాపక్షం/బూర్గంపాడు: పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు వేపలగడ్డ గ్రామ పంచాయితీ పరిధిలో సర్పంచ్ బొల్లి నిరోషా ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టారు. ఈసందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు ఆమె కార్డులు అందజేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పని చేస్తారని తెలిపారు.



వరుస తుఫాన్లతో రైతుల్లో ఆందోళన

ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న రైతులు ఆర్నాబ్, మురసు, వరుస తుఫానులతో పాటు వేగంగా బలమైన గాలులతో వరి పంట నేల వాలిపోవడం వరుసగా వస్తున్న తుఫానులతో పత్తి పంట లో పత్తి రంగు మారటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నుంచి కురుస్తున్న వదలని వానతో పత్తి వరి పంట దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 33 వేల ఎకరాలలో వరి పంట సాగు చేస్తుండగా దానిలో వెయ్యి ఎకరాలలో తుఫానుకు బలమైన గాలులు వీచడం వల్ల వెయ్యి ఎకరాలలో పంట నేలవాలి దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. అదే విధంగా పత్తి పంట 3400 ఎకరాలలో పత్తి పంట సాగు చేస్తుండగా ఇప్పటికే రెండు మూడు దశల్లో పత్తితీత కొనసాగుతుండగా వరి పంట కొన్ని ప్రాంతాలలో నేల వాలిపోగా మరికొన్ని గ్రామాలలో వరి కోత లు ముమ్మరంగా కొనసాగుతున్నవి. వర్షాభావ పరిస్థితి ఎల్నినో ప్రభావం దిగుబడి తగ్గుతుందని రైతుల్లో ఆందోళన ఉండగా ఆపై చేతికి అందే దశలో వరుస తుఫానులతో రైతులపై మరోభారం పడింది. పత్తి వరి ఎకరాకు రూ. 30000 పైగా పెట్టుబడి పెట్టి పంటలు కొనసాగిస్తుండగా వారం రోజుల్లోనే రెండు తుఫాన్లు రావడంతో రైతులను ఒకే సారి కుంగ తీసింది. దీంతో రైతుల్లో దిగాలు మొదలైంది. చేతి కొస్తున్న పంటలు కండ్ల ముందే ఆగమాగం అవుతుండటంతో ఆందోళన మొదలైంది. మండలంలో 44 వేల ఆయకట్టు లో 22,000 మంది రైతులు పలు రకాల పంటలను కొనసాగిస్తుండగా రబీ సీజన్లో వరి పత్తి పంట



లపై ఎల్ నినో ప్రభావం వర్షాభావం చీడపీడలు వరుస తుఫానులు తో రైతులను నట్టేట ముంచాయి. నేల వాలిన వరిపంట పనికిరాదని వరుస వర్షాలతో ఆపై కూలీలు కొరత ప్రభావంతో పత్తి రంగు మారడం జరుగుతుందని రైతులు మరియు వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. మండల పరిధిలోని పత్తి చిన్న కోరుకోండి ,పెద్ద కోరుకొండి, తాళ్లూరు వెంకటాపురం, ముచ్చవరం,పేరు వంచ, బత్తులపల్లి, లక్ష్మీ పురం తదితర గ్రామాలలో పత్తి పంటను అధికంగా సాగు చేస్తున్నారు. కల్లూరు, బోడి మల్లె, లింగాల, ఎర్రబోయినపల్లి, చంద్రుపట్ల, రఘునాథ గూడెం, వెన్నవల్లి, పాయపూర్ చెన్నూరు తదితర గ్రామాలలో వరి పంటను కొనసాగిస్తున్నారు. ఈ ప్రభావాలతో వరి పత్తి రైతుల్లో ఆందోళనగా ఉంది.

పట్టభద్రుల ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి



ప్రజాపక్షం/వైరాః ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటుతో కాంగ్రేస్‌కు బుద్ధి చెప్పాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం వైరాలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు ఐదు లక్షల మంది పట్టభద్రుల ఓటు నమోదు చేసుకున్నారని తెలిపారు. కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా జాబ్ క్యాలెండర్ అమలు కాలేదని, మెగా డీఎస్సీ హామీ మాటలకే పరిమితమైందని విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన గూగుల్ ఏఐ క్యాంపస్ పక్కా రాష్ట్రానికి తరలిపోయిందని ఆరోపించారు. కెసిఆర్ పాలనలో కెటిఆర్ ఐటి శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఐటి రంగానికి పెద్ద పీఠ వేసి అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుత పాలనలో ఐటి ఉద్యోగుల తొలగింపులు, పరిశ్రమల తరలింపు వంటి పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డిఏలు, పిర్సీలు అమలులో జాప్యం జరుగుతుందని విమర్శించారు. సర్వర్ సమస్యల కారణంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని బిఆర్ఎస్ నాయకులు ఎన్నికల అధికారులను కలిసి కోరినట్లు తెలిపారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యి పాఠశాలలను ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రేస్ పాలనలో గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు అనారోగ్యానికి గురవడం, ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు, భవనాల పెచ్చులు ఊడిపడటం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కావడంతో గిరిజన, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏటా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని విమర్శిస్తూ, కెసిఆర్ పదేళ్ల పాలనలో పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. పట్టభద్రుల ఓటరు నమోదు గడువు మరో రెండు రోజులు మాత్రమే ఉన్నందున అర్హులైన ప్రతిఒక్కరూ వెంటనే తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, విద్యావంతులు ఆలోచించి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, లకావత్ గిరి బాబు, కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, బాణాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు, సిరిపురం సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు, మద్దెల రవి, బానోతు రామ్మూర్తి, వాసిరెడ్డి రవి, మిట్టపల్లి కిరణ్‌కుమార్, ఏదునూరి శ్రీను, సింగవరపు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ నమూనాల తయారీపై విద్యార్థులకు అవగాహన



ప్రజాపక్షం/వైరాః విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన విధానాన్ని సృజనాత్మకతను పెంపొందించేందుకు అగస్త్య, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైరాలోని గాన గురుకుల బాలికల పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అగస్త్య, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థులకు ప్రాక్టికల్ యాక్టివిటీస్ ద్వారా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక అంశాలపై ఆసక్తి పెంపొందించడంతో పాటు సృజనాత్మకత నైపుణ్యాలను వెలికితీసేందుకు అవకాశం కలిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల రామారావు, పాఠశాల యాజమాన్యం, అగస్త్య, ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు.

పాఠశాలల్లో వరద బురద

ఇబ్బందుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, పాఠశాలలో గత రెండు రోజులుగా కురుస్తున్న మురసు తుఫానుకు గాను పాఠశాలల్లో వరద బురదతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న కోరుకొండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, పెద్ద కోరుకొండి ప్రాథమికోన్నత పాఠశాల, చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తదితర పాఠశాలలో గత కొన్ని సంవత్సరాలుగా భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా వర్షా కాలంలో కాలువలు సక్రమంగా లేనందున గ్రామాల పైనుంచి వస్తున్న వరద పాఠశాలలకు రావడంతో అవి ఎటుపోలేని పరిస్థితుల్లో నీరు నిలవబడి బురదగా మారి విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇదే విధంగా కొనసాగుతూ వస్తుంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మా పాఠశాలల్లో ఉన్న వరద బురద తో ఇబ్బందులు పడుతున్న మా సమస్యను పట్టించుకునే వారే కరువయ్యారని వారు తెలుపుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ పవన్ కుమార్ ను వివరణ కోరగా స్థానిక సర్పంచ్ పాలకవర్గం ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఈ విషయమై జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియపరచి నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేపిస్తామని తెలిపారు.

గేదెల కొనుగోళ్లలో భారీ గోల్‌మాల్!

-కలెక్టర్ ఆగ్రహం..సమగ్ర విచారణకు ఆదేశం
-బాధ్యులపై సస్పెన్షన్‌కు ఆదేశాలు



ప్రజాపక్షం/బోనకల్: మహిళా లబ్ధిదారులకు గేదెల పంపిణీ కోసం అమలు చేస్తున్న ఇందిర మహిళా డెయిరీ పథకంలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. గేదెల కొనుగోళ్లలో మధ్యవర్తుల జోక్యం ముందుగా నిర్ణయించిన ఉండి కేంద్రం నుంచి తాడేపల్లిగూడెంకు కొనుగోలు కేంద్రం మార్పు, కమీషన్ల డిమాండ్లు వివాదాస్పదంగా మారాయి. 25 గేదెల కొనుగోళ్లు పూర్తయినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఒక్కో గేదెపై రూ.5 వేల వరకు కమీషన్లు డిమాండ్ చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ దివాకర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను సస్పెండ్ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజను ఆదేశించారు. మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా చేపట్టిన పథకంలోనే అక్రమాల ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది.

మురసు తుఫాన్..కురుస్తున్న వర్షాలు



ప్రజాపక్షం/మధిరః బంగాళాఖాతంలో ఏర్పడిన మురసు తుఫాన్ ప్రభావంతో మధిర నియోజకవర్గ వ్యాప్తంగా గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. మధిర పట్టణంతో పాటు మధిర మండలం, ఎర్రుపాలెం, బోనకల్, ముదిగొండ మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. పొలాల్లో నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్‌పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో ఈ వర్షాలు రైతులను కలవరపెడుతున్నాయి. వరి, మిర్చి, పత్తి పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. తుఫాన్ నేపద్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మరో రెండు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ప్రజాపక్షం/ముదిగొండ: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా కార్యక్రమ అధికారిణి వైద్యురాలు ఎ.అరుణాదేవి సూచించారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటుచేసిన పొగాకు, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో విద్యను అభ్యసిస్తూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా మంచి స్నేహాలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు సోహైల్, జిల్లా కార్యక్రమ కోఆర్డినేటర్ సత్యనారాయణ, కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, నషా ముక్త్ భారత్ కోఆర్డినేటర్ టీ.ఉష, అధ్యాపకులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జె.నాగేంద్రప్రసాద్, సీహెచ్ఓ మధుసూదన్, ఏఎన్ఎం వసంత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




ప్రజాపక్షం/ముదిగొండ: తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్, ఆరెంజ్, ఎల్లో అలర్ట్‌లు జారీ చేసిన నేపథ్యంలో ముదిగొండ ఎస్‌హెచ్ఓ సీఐ మురళి సూచించారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినందున భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను గమనించాలని కోరారు. వర్షాల సమయంలో వాగులు, వంకలు, చెరువులు, కాలువలు పొంగిపొర్లే ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రహదారులపై వర్షపు నీరు నిలిచినప్పుడు ప్రయాణాలు చేయొద్దని, అత్యవసర పరిస్థితులు మినహా ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యమని, ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



ప్రజాపక్షం/వైరాః తెలంగాణలో కాంగ్రేస్ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో ముందుకు సాగుతుందని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రక మురళీకృష్ణ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో తెలంగాణ కాంగ్రేస్ ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, 4వ వార్డు కౌన్సిలర్ వేముల శ్రావణి రత్నాకర్‌తో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత చేరవ కావాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు సేవ చేయడమే తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ విఆర్వో షేక్ మస్తాన్, కాంగ్రేస్ పార్టీ నాయకులు పాలెం భాస్కర్, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నిబద్ధత గల సీనియర్ నాయకుడిని కోల్పోవడం బాధాకరం



- చప్పిడి నాగేశ్వరరావు కుటుంబానికి సిపిఐ అండగా ఉంటుంది
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌సి కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : ప్రజాఉద్యమాల్లో కార్మిక వర్గ హక్కుల పరిరక్షణలో సీనియర్ నాయకులు చేసిన సేవలు ఎనలేనివని వారు చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్త గూడెం ఎంఎల్‌సి కూనంనేని సాంబశివరావు అన్నారు. రామవరం పంజాబ్‌గడ్డ ప్రాంతానికి చెందిన సిపిఐ ఏఐటియుసి సీనియర్ నాయకులు చప్పిడి నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా మంగళవారం వారి నివాసానికి కూనంనేని వెళ్లి నాగేశ్వరరావు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం శోఖసముద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు సాగించిన నిబద్ధత గల ప్రజా నాయకున్ని కోల్పోవడం పార్టీకి కార్మిక వర్గానికి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితాంతం ప్రజా సమస్యల పరిష్కారానికే అంకితమైన ఆయన చూపిన బాటలో నడవటమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అన్నారు. బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. నివాళ్లర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పట్టణ నాయకులు గుత్తుల శ్రీనివాస్ మృతుడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మురసు.. ముసురు..!

- ఎడతెరిపి లేకుండా జల్లులు
- పెరిగిన చలి గాలుల తీవ్రత
- వరి పంటపై తీవ్ర ప్రభావం



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మురసు తుపాను ప్రభావంతో గడచిన 24 గంటలుగా ముసురు పట్టడంతో ఎడతెరిపి లేని వాన జల్లులు పడుతున్నాయి. దీంతో జనజీవనం కొంత ఇబ్బందిగా మారింది. చలి గాలుల తీవ్రత కూడా పెరగడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఈ చలి గాలుల వల్ల పిల్లలు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఈ వాతావరణ పరిస్థితి వరి పంటపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుపాను ప్రభావంతో రాగల రోజుల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున వ్యవసాయ రంగంపై ఆందోళన నెలకొంది. ఇప్పటికే కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు, కోతలు కోసి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యంపై వర్షపు ప్రభావం పడే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని జలాశయాలు చెరువులు కుంటల్లో నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉంది. భూగర్భ జలమట్టాలు పెరిగేందుకు కూడా వర్షం దోహదపడనుంది. మురసు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి నీటిని తాగాలని, చల్లటి పదార్థాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచనలు పాటించాలని చెబుతున్నారు.

అమరుల త్యాగాలు వృథా కానివ్వం



-మాస్‌లైన్ ఆధ్వర్యంలో అమరవీరుల వారోత్సవ సభలు

ప్రజాపక్షం/ఇల్లందు: సోషలిస్టు సమాజ స్థాపన కోసం జీవితాలను అర్పించిన విప్లవ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయ సాధనకు పోరాటాలను కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మర్రిగూడెం, పోలారం, ఎల్లన్ననగర్ గ్రామాల్లో పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల వారోత్సవ సభలు నిర్వహించారు. మర్రిగూడెంలో కుమార్ అన్న, పోలారంలో వజ్జ వీరభద్రం, ఎల్లన్ననగర్‌లో అజ్మీర రాంజీ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మొడెం రాంబాబు సభకు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు నాయిని రాజన్న, జిల్లా నాయకులు బుర్ర వెంకన్న, ఎదలపల్లి సావిత్రి, డివిజన్ నాయకులు శ్రీరామ్ కోటన్న, బుర్ర రాఘవులు, జూకంటి గాంధీ, బండారి సత్యం మాట్లాడుతూ 1969 నుంచి నేటి వరకు కమ్యూనిస్టు విప్లవోద్యమంలో ఎందరో పేద ప్రజల కోసం ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. పేదలు నేడు జీవనాధారం పొందుతున్న పోడు భూముల సాధన వెనుక అమరుల త్యాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. అమరులు చూపిన మార్గంలో పయనిస్తూ సోషలిస్టు విప్లవం, ప్రజాపంథా పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అమరులు చూసిన మార్గంలో పయనిస్తూ సోషలిస్టు విప్లవం, ప్రజాపంథా పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో బుర్ర లక్ష్మయ్య కోడి కృష్ణ, వల్లోజు చంద్రశేఖర్, తేలే లక్ష్మయ్య, గాదె సత్యనారాయణ, శ్రీరామ్ సురేష్, వల్లోజు జనార్ధన్, ఇరుపు ప్రసాద్, ఆమగోతు హరిలాల గుర్రం పుష్పరాజు, భుక్య బద్రు, అజ్మీర సక్రాం, గూగుల్ బద్రు, అజ్మీర పాప, బానోతు బిచ్చ, అజ్మీర భద్ర, బాణావతి చిన్న, గంగావతి పిక్క, గంగావతి లక్ష్య, పాల్గొన్నారు.

జోరుగా ఎంఎల్‌సి ఓటు నమోదు ప్రక్రియ



ప్రజాపక్షం/పాల్వంచ : అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీలు పోటా పోటీగా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటు నమోదు ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా తీసుకొన్నాయి. ఎన్నికల్లో పైచేయి సాధించటానికి ఇరు పార్టీ తమదైన శైలిలో పావులు కదుపుతున్నాయి. దీనితో ఆయా పార్టీ ఆధ్వర్యంలో పాల్వంచలో పోటా పోటీగా ఓటు నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. వరంగల్, ఖమ్మం, నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిచి తీరాలనే రెండు పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నుండి బరిలోదిగిన అభ్యర్థులు ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపును కాంక్షిస్తూ బిఆర్ఎస్ నేత రాజ్యసభ వద్దిరాజు రవిచంద్ర తన ప్రచారాన్ని కొనసాగిస్తు పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి విజయాన్ని కోరుతూ ఆపార్టీ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఆయా పార్టీల అగ్రనేతలు సభలు, సమావేశాలు పెట్టి తమ పార్టీలకు చెందిన వారిని గెలిపించాలని కోరుతున్నారు. పాల్వంచ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీలో యువజన కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన బత్తుల మధుచంద్ అనతి కాలంలోనే మాజీ ఎంఎల్‌సి వనమా వెంకటేశ్వరరావుకు అత్యంత నమ్మిన వ్యక్తిగా మారాడు. దీనితో కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో 38వ, డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేసి విజయం సాధించాడు. ఆయన నాయకత్వంలో గత 10 రోజులుగా పాల్వంచలో క్యాంపులు ఏర్పాటు చేసి ఎంఎల్‌సి ఓటు నమోదు ప్రక్రియను జోరుగా కొనసాగిస్తున్నారు. ఇతనితో పాటుగా గెలిచిన కార్పొరేటర్లు ఎంఎల్‌సి ఎన్నికల పట్ల అవగాహన లేకనో, మరే ఇతర కారణాలతో కానీ పట్టించుకోవటం లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. గతంలో అధికారాన్ని అడ్డం పెట్టుకొని పెత్తనం చెలాయించిన పలువురు నాయకులు ఓటు నమోదు ప్రచారంలో మోహం చాటేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బిఆర్ఎస్ పార్టీలో అన్నీ తానై ముందుండి ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఓటు నమోదుకు కృషి చేస్తున్న బత్తుల మధుచంద్‌కు రాబోయే రోజుల్లో పార్టీలో ఉన్నత పదవులు దక్కే అవకాశం ఉందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తానని డబ్బుల వసూలు?

-గంగారం తండా ఫీల్డ్ అసిస్టెంట్ గణేష్‌పై రాష్ట్ర కమిషనర్‌కు ఫిర్యాదు



ప్రజాపక్షం/కారేపల్లి: ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని రూ 50వేలు డిమాండ్ చేసి వసూలు చేశారంటూ గంగారం తండా ఫీల్డ్ అసిస్టెంట్ గణేష్‌పై ఆరోపణలు వచ్చాయి. బాధితులు పంచాయితీ రాజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ దివ్యకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం అధికారులు విచారణ చేపట్టారు. అడిషనల్ డీఆర్డీఓ శిరీష, ఏపీడీ శ్రీదేవి, ఎంపీడీఓ పద్మ, సర్పంచ్ నునావత్ కిరణ్ అధ్యక్షతన విచారణ నిర్వహించారు. బాధితురాలు భూక్య రాజీ(భర్త రాంజీ)అధికారుల ఎదుట రూ 20వేలు ఇచ్చినట్లు వెల్లడించిందని గ్రామస్తులు తెలిపారు. డాబా ఇళ్లు ఉన్నవారికీ డబ్బులిస్తే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని చెప్పి వసూళ్లకు పాల్పడుతున్నారంటే బాధితులు ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల అండతో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులపైనా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. స్పందన లేకుంటే ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని బాధితులు హెచ్చరించారు. ఇరు వర్గాల వాంగ్మూలాలు నమోదు చేశామని, నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని విచారణ అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పేరిట డబ్బులు వసూలు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా డబ్బులు అడిగితే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పోట్ల రామనరసయ్య ఆశయసాధనకు ఉద్యమిద్దాం



ప్రజాపక్షం/కారేపల్లి: దోపిడీ, పీడనలేని సమాజ నిర్మాణం కోసం అమరవీరుల ఆశయ సాధనకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్న పిలుపునిచ్చారు. పోట్ల రామనరసయ్య 50వ వర్ధంతి సభ కారేపల్లి మండల శాంతినగర్‌లో భూక్య శివ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా అశోక్ మాట్లాడుతూ భూస్వాములు, పెత్తందారులు, అటవీ శాఖ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా రామనరసయ్య అనేక పోరాటాలు నిర్వహించారని, గోదావరి లోయలో గిరిజన పేదలకు లక్షలాది ఎకరాల పోడు భూములు దక్కేందుకు విప్లవకారులు పోరాడారని గుర్తు చేశారు. ఈ సభలో చంద్రయ్య, బాలకృష్ణ, వెంకన్న, హరిబాబు, రాంబాబు, రాధా, గురువమ్మ, రాజు, బచ్చల కృష్ణ, రవి, మేస్త్రీ వెంకన్న, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పీఎంకేవివై 4.0 కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో పి ఎం కె వి వై4.0 కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఓ సారంగపాణి తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో ప్రధానమంత్రి కౌసిల్ వికాస్ యోజన పథకం ద్వారా ఫిట్టర్ మెకానికల్ మెయింటెనెన్స్ కోర్సు కు మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్న ఈ బ్యాచ్ లో ప్రవేశం పొందగోరు వారు 18 సంవత్సరాల నుండిన అభ్యర్థులు పదోతరగతి మేము, ఆధార్ కార్డులతో కాలేజీలోకి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పొందవచ్చు అన్నారు.

ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం



ప్రజాపక్షం /గుండాల : శంబునిగూడెం పంచాయితి ప్రజలకు ఏ ఆపద వచ్చిన నేనున్నాను అంటు సర్పంచి సుమలత భర్త రాజబాబు ముందువరుసలో ఉంటానని బరోసా కల్పిస్తూ అపన్నహస్తం అందిస్తున్నారు. శంభునిగూడెం గ్రామంలో ఇటీవల మృతిచెందిన కుంజ దాసు దాసు కుటుంబానికి రాజబాబు , వార్డు సభ్యుల సహకారంతో దశదిన కర్మలకు 8వేల విలువగల నిత్యావసర సరుకులను మంగళవారం మృతుని కుటుంబానికి అందచేసి వారి అవుదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , పంచాయితీలోని ఏ కుటుంబానికి ఆపద వచ్చిన వారికి తనవంతు సహకారాన్ని అందించడం జరిగిందని, జరుగుతుందని అన్నారు. తమ ఎంతో నమ్మకంతో పంచాయితీ ప్రజలు సర్పంచిగా సుమలతను గెలిపించుకోవడం జరిగిందని , ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా పంచాయితి అబివృద్ధికి కృషిచేస్తున్నామని , దానితోపాటు ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఈసం సుమలత, ఉపసర్పంచివట్టంక్రిష్ణయ్య, వార్డు సభ్యులు శివ క్రిష్ణ, యమున, బుచ్చయ్య, సమ్మయ్య, శేఖర్, హరినాథ్, స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుపై విస్తృత ప్రచారం చేయాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించాలని మండల కాంగ్రెస్ నాయకురాలు పసుపులేటి శ్రీలత పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 2023 నవంబర్ నాటికి డిగ్రీ లేదా సమానమైన డిప్లొమా పూర్తి చేసిన అర్హులు ఫారం 18 ద్వారా ఈ నెల 6వ తేదీలోగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్త మరెడ్డి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. యువత, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను మండలిలో ప్రస్తావించేందుకు కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

పాలేరు లింక్ కెనాల్ భూసేకరణను నిలిపివేయాలి

-మాకు కాలువ వలన ప్రయోజనం లేదు
-తహసీల్దార్‌కు నాలుగు గ్రామాల రైతుల వినతి





ప్రజాపక్షం/ రఘునాథపాలెం : సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా ప్రతిపాదించిన పాలేరు లింక్ కెనాల్ భూసేకరణపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలను బలితీసుకునే కాలువ నిర్మాణం తమకు వద్దంటూ రఘునాథపాలెం మండల పరిధిలోని నాలుగు గ్రామాల రైతులు ఆందోళన బాట పట్టారు. మంగళవారం మండలంలోని చిమ్మపుడి, మంచుకొండ, కోయచలక, రేగులచలక గ్రామాల రైతులు రఘునాథపాలెం తహసీల్దార్ ఎస్. శ్వేతను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాలువ తవ్వకం వల్ల వచ్చే ప్రయోజనాల కంటే తాము సర్వస్వం కోల్పోయి నడి రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సారవంతమైన భూములను కెనాల్ కోసం లాక్కుంటే తాము బతికెదెలా గని వారు ప్రశ్నించారు. వ్యవసాయం వృత్తిగా ఆధారపడి జీవిస్తున్న తమ కుటుంబాల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. అధికారులు కాలువ ప్రతిపాదనను రద్దు చేసి భూసేకరణను తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ గోడును పట్టించుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని రైతులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి మాట్లాడుతూ రఘునాథపాలెం మండల రైతులు తమ భూములకు సరైన ధర, సాగునీటి సౌకర్యం లేని సమయంలో బావులు, బోర్లు వేయించుకుని నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. గతంలో రూ. 120 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్‌తో పైపులైన్ ద్వారా మండలంలోని చెరువులను నింపి సాగునీటిని అందిస్తామని చెప్పి మరల పనులు పూర్తి కాకుండానే కెనాల్ పనులంటూ రైతుల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తుందన్నారు. కెనాల్ నీళ్లు సాగుకు అవసరం లేదని ఎట్టి పరిస్థితుల్లోనూ మా భూములు ఇచ్చేది లేదన్నారు. బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తే అడ్డుకుంటామన్నారు. వైరా మాజీ శాసన సభ్యురాలు బానోత్ చంద్రావతి రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సమావేశంలో మండల రైతులు గుత్తా వెంకటేశ్వర్లు, నున్నా శ్రీనివాస్, మాధంశెట్టి హరిప్రసాద్, నున్నా వెంకటేశ్వర్లు, గుండ్ల ముత్తయ్య, ప్రొద్దుటూరు కోటిరెడ్డి, మారం వెంకటరెడ్డి, తోట వెంకట్, కోటేరు మనోహర్‌రెడ్డి, కొనకంచి బాబు, రవి, మారం సత్యంరెడ్డి, నాలుగు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐటిలో ప్రెషర్స్ డే వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎస్‌బిఐటి కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులను ఆహ్వానిస్తూ ఆరంబ్ ప్రెషర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో కళాశాల దశ ఎంతో కీలకమైందన్నారు. ఈ దశలో క్రమశిక్షణ, పట్టుదల, నైపుణ్యాభివృద్ధి, సృజనాత్మకత ఆలోచనలకు ప్రాధాన్యతని వ్వాలన్నారు. విద్యార్థులు కేవలం అకాడమిక్ విద్యకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న వివిధ శిక్షణా కార్యక్రమాలు, సాంకేతిక వేదికలు, ప్లేస్‌మెంట్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ ర్యాగింగ్ రహిత కళాశాలగా తమకు ఉన్న పేరును నిలబెడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలు, వినోద కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్ విద్యార్థులు నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికి కళాశాల వాతావరణం అలవాటుపడేందుకు సహకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని మధిర ఎక్సైజ్ భవనం



ప్రజాపక్షం/మధిరः తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఎక్సైజ్ శాఖకు సొంత భవనం నిర్మించి 15 ఏళ్లు పూర్తయినా ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదు. మధిర పట్టణంలో ఎక్సైజ్ శాఖకు సొంత భవనాన్ని 2010లోనే పూర్తి చేశారు. నిర్మాణం అంతా పూర్తయినా, ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ భవనం ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో భవనం నిరుపయోగంగా పాడుబడుతుంది. మరోవైపు మధిర ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది నేటికి అద్దె భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. సొంత భవనం పక్కన ఉండి కూడా అద్దె భవనంలో పనిచేయడం, ప్రతి నెలా ప్రభుత్వం అద్దె చెల్లించాల్సిన రావడం విమర్శలకు తావిస్తుంది. ఒకవైపు భవనం పూర్తయి ఉండి శిథిలావస్థకు చేరుకుంటుంటే, మరోవైపు అద్దె భవనంలో ఇరుకు గదుల్లో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. డిప్యూటీ సిఎం నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఉండటంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తయిన ఎక్సైజ్ భవనాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని, మరమ్మత్తులు చేసి ప్రారంభించాలని ప్రజలు, ఎక్సైజ్ సిబ్బంది కోరుకుంటున్నారు.

మోడల్ స్కూల్ ఒకేషనల్ ఉపాధ్యాయుల వేతనాల కోసం నిరసన



ప్రజాపక్షం/పెనుబల్లిः ఆదర్శ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఒకేషనల్ ఉపాధ్యాయులు తమ వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం మెరుపు సమ్మె చేపట్టారు. గత ఆరు నెలలుగా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, హైదరాబాద్‌లోని ఒకేషనల్ సెంటర్ ఎదుట సైతం రాష్ట్రవ్యాప్త నిరసనలు నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతినెలా సకాలంలో వేతనాలు చెల్లించాలని, అలాగే సమాన పనికి సమాన వేతనం అందించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల ఒకేషనల్ ఉపాధ్యాయులు సుష్మ, విజయ్, శ్రీదేవి, శిరీషలతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యునిస్టు గోవిందరావు

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి



ప్రజాపక్షం/చింతకాని ः సీపీఐ నాయకులు బస్వాపురం గ్రామానికి చెందిన కళ్యాణపు గోవిందరావు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు.ఆయన మరణవార్త తెలుసుకున్న పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి బస్వాపురం చేరుకొని గోవిందరావు మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ గోవిందరావు బ్రతికినంతకాలం ఎర్రజెండా ని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు.గోవిందరావు కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు యర్ర బాబు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, జిల్లా సమితి సభ్యులు రాసాల మోహన్‌రావు,వరద నర్సింహారావు, మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, గ్రామ సర్పంచ్ ఆవుల నర్సింహారావు, ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, నాయకులు బుర్ర అంజయ్య, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

-నగర కమిషనర్ అభిషేక్ అగస్త్య



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : వెలుగుమట్లలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లతో పాటు కాలనీలో చేపడుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పరిశీలించారు. ఇంజనీరింగ్, గృహ నిర్మాణ విభాగాల అధికారులతో కలిసి ఆయన పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా పనులు ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కాలనీల్లో ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువ పనులను పరిశీలించారు. కాలనీ చుట్టూ ప్రహారీ నిర్మాణం, తాగునీటి సరఫరా, పైపులైన్ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలను తప్పక పాటించాలని ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు.

వృద్ధాశ్రమంలో ఉప్పలచారి జన్మదిన వేడుకలు

రోగులకి పండ్లు, బ్రెడ్ పంపిణీ





ప్రజాపక్షం/వైరాः నిధి ఇట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ మేనేజ్మెంట్ అండ్ డైరెక్టర్ గరిడేపల్లి సాయికిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా రామోజి ఉప్పలచారి జన్మదిన వేడుకలను గొల్లపూడి వృద్ధాశ్రమంలో నిర్వహించారు. అనంతరం వైరా గవర్నమెంట్ హాస్పిటల్‌లో రోగలతో స్వీట్లు డిస్ట్రిబ్యూషన్ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి వారికి స్వయంగా వంటకాలను వడ్డిస్తూ వారితో ఆప్యాయంగా ముచ్చటించి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పలచారి మాట్లాడుతూ పుట్టినరోజును వృద్ధుల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధుల సంక్షేమం, అభివృద్ధికి ప్రతిఒక్కరూ తమ వంతు చేయూత అందించాలని కోరారు. మనం అందించే చిన్న సహాయం సైతం వారికి ఎంతో అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. వృద్ధులను ప్రేమతో, ఆప్యాయతతో ఆదరించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి వినోద్, మోద్రు సురేష్, మొండ్రు బాలరాజు, వేముల శ్రీనాథ్, మురళి, దేవళ్ళ సాయి, రాచకొండ సాయి, నిఖిల్, బత్తుల సాయి, ఆసిఫ్, చింతపల్లి మానికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు

వివిఎం బంజర హైస్కూల్ విద్యార్థులు ఎంపిక



ప్రజాపక్షం/పెనుబల్లిः ఈ నెల5, 6 తేదీలలో హైదరాబాద్ లోని అప్పా ఇండోర్ స్టేడియం లో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వియం బంజర్ జిల్లా పరిషత్ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్టు వియం బంజర్ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం ఎస్ సత్యనారాయణ తెలిపారు. ఈనెల 2 న ఖమ్మంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వీరికి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. హెచ్ఎం తెలిపిన వివరాలు ప్రకారం.. పెనుబల్లికు చెందిన పర్స అహల్య, రామచంద్ర రావు బంజరుకు చెందిన పింగిలి ఆసిని, బాలుర విభాగం కు చోడవరం కు చెందిన ఎట్టి మోటు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వియ్యం బంజర జిల్లా పరిషత్ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల పిఇటి బండి రాము, ఉపాధ్యాయులు పెనుబల్లి మండల ప్రజలు అభినందనలు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి గెలుపొందాలని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

క్లస్టర్లు ఎక్కడ..? విధులు ఎక్కడ..?

- ఖమ్మం కార్యాలయానికే పరిమితం అవ్వడంలో ఆంతర్యం ఏమిటీ
- నిత్యం సారు పేరు చెప్పుకుంటూ తప్పించుకుంటున్న వైనం
- జిల్లా స్థాయిలో తీవ్రచర్చనీయాంశంగా మారిన ప్రజాపక్షం కథనం



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ ః సాక్షాత్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇలాకాలో కొందరు జీపీఓలు వ్యవహరిస్తున్న తీరుపై ప్రజాపక్షం ప్రచురించిన కథనం జిల్లా వ్యాప్తంగా తీవ్రచర్చనీయాంశంగా మారింది. జీపీఓలు వ్యవహారంపై ప్రజాపక్షానికి పలువురు ఫోన్ చేసి అక్షర సత్యం గానే వ్యవహరిస్తున్నారనే పేర్కొనడం తీరుకు నిదర్శనంగా నిలిచింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయాల్సిన గ్రామ పాలనాధికారులే అందుబాటులో లేకపోతే ఇక ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలంటున్నారు. కేటాయించిన క్లస్టర్లలో విధులు నిర్వ హించకుండా కేవలం ఖమ్మానికి పరిమితమవుతుండటంపై మండిపడు తున్నారు. సర్టిఫికెట్ కోసం 25నుంచి30కిలోమీటర్ల దూరం నుంచి రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా పాలానాధికారుల పనితీరుపై వస్తున్న ఫిర్యాదులు ఇప్పుడు ఈ ప్రశ్నలను లేవనెత్తుతు న్నాయి. అంతేకాకుండా జీపీఓల విధులు నిర్వహణపై గ్రౌండ్ నుంచి అందుతున్న మరిన్ని ఫిర్యాదులు వెలుగులోకి వస్తున్నాయి.

ప్రజలకు ఇబ్బందులు

ప్రతి జీపీఓను కేటాయించినట్లు క్లస్టర్ వివరాలు. విధులు నిర్వహించా ల్సిన కేంద్రం. రోజువారీ హజరు, క్షేత్రస్థాయి పర్యటనల వివరాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. కార్యాలయంలో అందు బాటులో లేని సమయంలో వారు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలకు సంబంధించిన వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు జీపీఓలు పట్టించుకోవడం లేదని స్థానికి ప్రజలు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారాలపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నత స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే వారు ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగు తుందంటున్నారు.

సారు చెబుతూ విధులలో ఇష్టారాజ్యం

క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను అందించాల్సిన కొందరు జీపీఓలు విధులకు దుమ్మాకొట్టేందుకు పై అధి కారుల పేర్లను సాకుగా చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎరైనా ప్రజలు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవిస్తే సార్‌తో బిజీగా ఉన్నామని, ప్రస్తుతం అందుబాటులో లేమని సమాధానాలు చెబుతూ బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అసలు జీపీఓలు తమకు కేటాయించిన విధులను ఎక్కడి నుంచి నిర్వహి స్తున్నారు. క్షేత్రస్థాయిలో వారి హాజరు. విధుల నిర్వహణపై పర్యవేక్షణ వంటి ప్రశ్నలు ఉత్పన్నం చేస్తున్నాయి. జీపీఓల హాజరు రికార్డులు, క్షేత్రస్థాయి విధుల నిర్వహణపై ఉన్నతాధికారుల సమగ్రంగా పరిశీలిస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

జీఓ ఏం చెబుతోంది?

తెలంగాణ ప్రభుత్వం 2025 మార్చి 22న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం 41 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 10,954 గ్రామ పాలానాధికారుల పరిపా లన మంజూరు చేసింది. గ్రామ పరిపాలనను బలోపతం చేయడమే ఈ వ్యవస్థ వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశంగా ఏర్పడింది. అలాగే దీనికి చట్టబ ద్ధతగా 2025 మార్చి 29న జారీ చేసిన జీఓ ఆర్టీ నెం.129లో జీపీఓల విధులు, బాధ్యతలకు సంబంధించిన మార్గదర్శకాలు పొందుపరిచారు. అలాగే 2026 ఫిబ్రవరి 12న ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.32 ద్వారా పాలానాధికారుల సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌ను ఖరారు చేసింది. ఈ నిబంధనల్లో సంబంధిత జిల్లా కలెక్టర్ నియామక అధికా రితో పాటు క్రమశిక్షణాధికారిగా పేర్కొన్నారు. అయినప్పటికీ కొందరు జీపీఓలు సమయపాలన, విధుల ప్రాంతాలకు దూరంగ ఉండటం జిల్లా మేజిస్ట్రేట్‌నే ఛాలెంజ్ విసిరినట్టుగా ఉందనే చెప్పాలి.

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానం

కూతురు నిశ్చితార్థ వేడుకకు రావాలని కోరిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్





ప్రజాపక్షం/వైరాः వైరా శాసనస భ్యులు మాలోతు రాందాస్‌నాయక్ తన పెద్ద కుమార్తె గాయత్రి నిశ్చితార్థ వేడుకకు హాజరు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్ర మార్క సతీమణి నందిని దంపతు లను మర్యాదపూర్వకంగా ఆహ్వానిం చా రు. ఈ నెల6వ తేదీన జరగనున్న నిశ్చితార్థ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దంపతు లకు అందజేశారు. ఈ శుభకార్యానికి విచ్చేసి వధూవరుల ను ఆశీర్వదించాలని కోరారు. తన కుటుంబంలో జరగనున్న శుభకార్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దంపతులను ఆహ్వానించడం జరిగిందని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తెలిపారు.

సిద్ధినేని కోటయ్య పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శం

- సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్
- గూడూరుపాడులో ఘనంగా 20వ వర్ధంతి వేడుకలు



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ ః ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ, జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి కొనసాగిన సిద్ధినేని కోటయ్య పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శమని సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామంలో సిద్ధినేని కోటయ్య 20వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం కోటయ్య చేసిన సేవలు, సాగించిన పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఎర్రజెండా అండతో ప్రజల పక్షాన నిలిచిన ఆయన జీవితం ప్రతి ఒక్కరీ స్ఫూర్తిదాయకమన్నారు. కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన అందించిన సేవలను నేటి తరం యువత గుర్తించి, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, మాజీ సర్పంచ్ బండి ఉపేందర్, స్థానిక నాయకులు సిద్ధినేని మంగయ్య, బోస్, బోలుకొండ వెంకరమణ, పోటు నాగరాజు, బండి మహేష్, ఎస్ శేఖర్, డి. హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

తెల్దారుపల్లి వద్ద ఎన్నెస్పీ కాల్వపై బ్రిడ్జి నిర్మిస్తాం

- మంత్రి పొంగులేటి
- 14,15,16వ వార్డుల్లో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ ః తెల్దారుపల్లి వద్ద స్థానిక రైతులు గ్రామా నికి అవతల వైపు ఉన్న తమ వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు, గ్రామస్థుల సౌకార్యార్థం రూ. 5కోట్ల నిధులతో ఎన్నెస్పీ కాలువపై నూతన బ్రిడ్జిని నిర్మిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశా ఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏదు లాపురంమున్సిపాలిటీపరిధిలోని తెల్దారుపల్లిలోని 14,15,16వ వార్డుల్లో రూ.3.20కోట్లతో నిర్మించే సీసీరోడ్లకు కలెక్టర్ దివాకర టిఎ స్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ...ప్రజా ప్రభుత్వం వచ్చిన ఈ 33నెలల్లో తెల్దారుపల్లి అభివృద్ధికి రూ.16.06 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రూ.5.25 కోట్లతో 105 ఇందిరమ్మ ఇళ్లను పేదలకు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని, ఉచిత విద్యుత్, మహిళకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, అందిస్తున్నామన్నారు. రైతులకు రూ.2లక్షల రుణ మాఫీ, ఎకరాకు రూ. 6వేల చొప్పున ఏడాదికి రూ. 12వేల రైతు భరోసా రకం ధాన్యం రైతులకు బోనస్ ఇచ్చి ప్రోత్సహించామన్నారు. రాష్ట్రంలో రెండు విడతల్లో ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని, హైద రాబాద్‌నగరంలో అర్హులైన పేదలకు ఇళ్లు ఇస్తున్నామన్నారు. ఇందు కోసం మొత్తం రూ. 40వేల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రం లో సుమారు 15 సంవత్సరాల క్రితం భూముల సర్వే జరిగిందని, మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వం సర్వే చేపించి. రైతులు పూర్తి భరోసా కల్పించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పాలేరునియో జకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఈ సర్వేను వెంటనే చేపట్టాలని ఇప్ప టికే కలెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్ర మంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కౌన్సిలర్లు తమ్మినేని మంగతాయి, గొడ్డుగొర్ల కృష్ణకుమారి, రవీందర్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, ఆర్డీఓ శ్రీనివాస్,కాంగ్రెస్ నాయ కులు మద్ది మల్లారెడ్డి, ధరావత్ రామ్మూర్తినాయక్, కందుకూరి వెంకట నారాయణ, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ కిషోర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- 10వ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యంపై ఆరా



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం ః విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధిం చాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం కొత్తగూ డెంలోని మేదర్ బస్తీ ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా 10వ తరగతి సిలబస్, విద్యార్థుల సామర్థ్యంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అభ్యసన సామర్థ్యాలను సాధిం చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. డిజిటల్ తరగతులు పరిశీలించి తగు సూచనలు చేశారు. చదువుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి వారి విద్యా సామ ర్థ్యాలు మెరుగుపడేలా కృషి చేయాలని ఈ ఏడాది గతం కంటే ఉత్తమ ఫలితాలు రాబట్టాల న్నారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడి అభ్యసన స్థాయి స్వయంగా పరిశీలించారు. గణితంలో మరుగైన విధానాలను వివరించాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. అనంతరం మధ్యాహ్న భోజన తీరును పరిశీలించిన ఆయన ఆహార తయారీలో పరిశు భ్రత ప్రమాణాలు పాటించాలని సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహశీ ల్దార్ పుల్లయ్య హెచ్ఎం వివిఎల్ కుమార్ బోధన బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ ఏరియాను సందర్శించిన డిఎంఅండ్‌హెచ్ఓ



ప్రజాపక్షం/మణుగూరుః ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో గల చేపల మార్కెట్ ను మంగళవారం డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ తుకారం రాథోడ్ సందర్శించి ప్రజల తో గ్రామంలో ఏమి జరిగిందని వాకబు చేస్తూ వారి సమస్య లను అడిగి తెలుకున్నారు. మున్సిపల్ కమీషనర్ తో కలిసి గ్రామంలో పర్యటిస్తూ పరిసరాలను పరిశీలించారు. మిషన్ భగీరథ నీటిని కాచి చల్లార్చి తీసుకోవాలని, పారుశుధ్య కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ప్రజలలో అపోహలు తొలగించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు ను సందర్శించి ఆశా డే కార్యక్రమం లో పాల్గొని నెలవారి సమీక్ష నిర్వహించి, రికార్డులను, రిపోర్ట్ లను పరిశీలించి టీబీ, లేప్రోసి, అసంక్రమిత వ్యాధులైన షుగర్, బీపీ, కాన్సర్ పై అవగాహన కలిగి ఉండి వాటిని నిర్మూలించే దిశ గా అడుగు లు వేయాలని సూచించారు. వారికి నెల వారి సరియడా టెస్ట్ కిట్స్ మరియు మందులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిపిఎంఓ మోహన్, సీహెచ్ఓ వీరాస్వామి, సూపర్ వైజర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసి పోలీస్ ఉద్యోగాలు సాధించాలి

- ఐటిడిఏ పిఓ రాహుల్

ప్రజాపక్షం/భద్రాచలం ః గిరిజన యువతీ యువకులు క్రమశిక్షణతో శిక్షణను పూర్తి చేసి పోలీస్ ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. మంగళ వారం ఐటిడిఏ ప్రాంగణంలో ఐటిడిఏ ద్వారా చేపడుతున్న పోలీస్ శిక్షణ క్యాంపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ బోధించే సమయంలో తప్పని సరిగా నోట్స్ రాసుకోవాలన్నారు. నేర్చుకున్న దానిని ఎప్పటికప్పుడు మననం చేసుకుంటే జ్ఞాప కశక్తి మెరుగుపడి పరీక్షల సమయంలో భయం లేకుండా ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. పోలీస్ ఉద్యోగాలు సాధించే లక్ష్య ం పెట్టుకున్న యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఇటిసి ప్రిన్సిపల్ డా.వీరూనాయక్, ఏసిఎంఓ రమేష్ కేర్ సర్వేశ్వర్ దొర వార్డెన్ మోహన్ పిడిలు వసంతం పార్వతి యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన వరి పంట..!



-ఎల్‌నినోతో ఎండిన పంటలు
-ఆర్నబ్ తర్వాత మురసు తుఫాన్ దెబ్బ
-భారీ ఈదురుగాలులకు నేలవాలిన వరి
-నీట మునుగుతున్న పొలాలు,
-పెట్టుబడులైనా దక్కుతాయో లేదోనని రైతుల ఆవేదన

ప్రజాపక్షం/నేలకొండపల్లి : అన్నదాతకు ఈ ఏడాది ప్రకృతి పరీక్షలు తప్పడం లేదు. తొలుత ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక సాగు చేసిన పంటలు ఎండిపోయి నష్టాలు మిగల్చగా.. ఇప్పుడు వరుస తుఫాన్లు రైతులను మరింత కలవరపెడుతున్నాయి. ఆర్నాబ్ తుఫాన్ ప్రభావం నుంచి తేరుకోకముందే మురాసు తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, వీస్తున్న భారీ ఈదురుగాలులు వరి రైతులను దెబ్బతీస్తున్నాయి. గాలుల తీవ్రతకు ఏపుగా పెరిగిన వరి పైరు పొలాల్లో పూర్తిగా నేలవాలిపోతోంది. మరోవైపు వర్షాలకు పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పంట దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లముందే నేలకొరుగుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎల్‌నినో దెబ్బకు ఎండిన పంటలు

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సాగు ప్రారంభం నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. నీటి లభ్యత లేక బోరుబావులపై ఆధారపడి పంటలను కాపాడుకునేందుకు అదనపు ఖర్చులు భరించారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడితో పంటలు ఎండిపోయి నష్టాలు మిగిల్చాయి. ఇప్పటికే పెట్టుబడుల భారం మోస్తున్న రైతులకు పంట చేతికొచ్చే సమయంలో వరుస తుఫాన్లు మరో సమస్యగా మారాయి.

ఆర్నాబ్ తర్వాత మురసు తుఫాన్ దెబ్బ

ఒక తుఫాన్ ప్రభావం నుంచి కోలుకోకముందే మరో తుఫాన్ ప్రభావం రైతులను వెంటాడుతోంది. మురాసు తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, భారీ ఈదురుగాలులకు వరి పొలాల్లో పైరు పూర్తిగా నేలవాలిపోయింది. పంట కోతకు సిద్ధమవుతున్న సమయంలో ఈ పరిస్థితి ఎదురుకావడంతో దిగుబడి తగ్గుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నేలవాలిన వరి కంకులు వర్షాలకు తడిసి ధాన్యం మొలకెత్తడం, నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

పెట్టుబడులు దక్కేనా.. అప్పులు తీరేనా?

ఒకవైపు కరువు ఛాయలు.. మరోవైపు తుఫాన్లు, అకాల వర్షాలతో రైతులకు కష్టాల మీద కష్టాలు ఎదురవుతున్నాయి. పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన అన్నదాతకు చివరి దశలో ప్రకృతి వైపరీత్యాలు నష్టాన్ని మిగులుస్తున్నాయి. ఆరుగాలం శ్రమకు తగిన ఫలితం దక్కుతుందో లేదోనని రైతులు దిగులు చెందుతున్నారు.

కష్టమంతా నేలపాలు..

మల్లెబోయిన శ్రీనివాసరావు, రైతు, భైరవునిపల్లి

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక బోరుబావుల కింద అదనపు ఖర్చులు పెట్టి పంటను కాపాడుకున్నాం. ఇప్పుడు భారీ ఈదురుగాలులకు వరి పైరు నేలవాలిపోవడంతో దిగుబడిపై ఆశలు సన్నగిల్లాయి.

అప్పులు ఎలా తీర్చాలి?

జంగం ఎలమందరావు, రైతు, రామచంద్రపురం



పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చాలంటే మంచి దిగుబడి రావాలి. కానీ వరుస తుఫాన్లతో పొలాల్లో నీరు నిలిచి, ధాన్యం నాణ్యత దెబ్బతినే పరిస్థితి ఏర్పడటంతో పెట్టుబడులు కూడా చేతికొస్తాయో లేదోనని భయంగా ఉంది.

భద్రత అమలు పటిష్టంగా ఉండాలి : కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం ; ఈవీఎం గోదాముల వద్ద భద్రత నియమాలు పటిష్టంగా అమలు చేయాలని, ఎలాంటి లోపాలకు తావివ్వరాదని కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణంలో గల ఈవీఎం గోదామును ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని నిర్దేశించిన భద్రతా ప్రమాణాలను పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ముందస్తు అనుమతులు లేకుండా ఎవ్వరినీ లోనికి వెళ్లనివ్వొద్దని లోపాలు ఏవైనా గుర్తిస్తే వాటిని తక్షణమే సరిదిద్దాలని ఆదేశించారు. అనంతరం తనిఖీ రిజిష్టర్‌లో సంతకం చేశారు. ఈ తనిఖీల్లో కొత్తగూడెం ఆర్డీఓ మధు తహశీల్దార్ పుల్లయ్య ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్ ఎన్నికల సిబ్బంది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

- ఎస్పి రోహిత్ రాజ్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం ; పోలీస్ సిబ్బంది సంక్షేమం సౌకర్యాల కల్పనే ప్రాధాన్యంగా ముందుకు సాగుతన్నామని ఎస్పి రోహిత్‌రాజ్ అన్నారు. మంగళవారం చేతకొండలోని 6వ బెటాలియన్‌లో ఎస్పి నెన్ బ్యారెక్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు ఘనస్వాగతం పలికి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్ సిబ్బందికి అవసరమైన మౌళిక వసతుల కల్పనకు కృషి జరుగుతోందని, తద్వారా పోలీస్ శాఖ పనితీరు మరింత బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ పిసివి రమణ, అదనపు కమాండెంట్ ఎస్ శ్రీధర్ రాజా అసిస్టంబట్ కమాండెంటుల ఏవి రమణయ్య రామకృష్ణ రెడ్డి సిఐ వెంకటేశ్వర్లు ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ ఆర్ఐలు జే లెనిన్‌బాబు సిహెచ్‌వి శ్రీనివాసరెడ్డి జివి రామారావు జి జానయ్య బెటాలియన్ పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



- డీపీఓ అనూష

ప్రజాపక్షం/చుంచుపల్లిః పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీపీఓ అనూష అన్నారు. చుంచుపల్లి మండలంలోని విద్యానగర్, బాబుక్యాంప్ గ్రామ పంచాయతీల్లో మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) అనూష మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులపై స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. విద్యానగర్ కాలనీలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వర్షాల కారణంగా చెత్త పేరుకుపోవడం, మురుగునీరు నిల్వ ఉండటం వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం బాబుక్యాంపు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లోని శ్మశానవాటిక, పల్లె ప్రకృతి వనం, చెత్త వేరు చేసే షెడ్, నర్సరీ తదితర పంచాయతీ ఆస్తులను పరిశీలించారు. వాటి నిర్వహణ, పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్త సేకరణను నిరంతరం పర్యవేక్షించాలని, పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని డీపీఓ అనూష సిబ్బందికి ఆదేశించారు.

విద్యార్థుల హాజరు వంద శాతం ఉండాలి

బడి మానేసే విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి
ఎంఈఓ చలపతిరావు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు వంద శాతం నమోదయ్యేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు సూచించారు. మంగళవారం మండల కేంద్రం లోని ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను సమీక్షించారు. బడికి రాని విద్యార్థులను గుర్తించి, వారు తిరిగి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా బోధనా పద్ధతుల్లో మార్పులు తీసుకొచ్చి నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. ఈవ్యర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, మధ్యాహ్న భోజనంలో నిర్ణీత మెనూను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్‌తో ఆందోళనలో అన్నదాత



ప్రజాపక్షం/పాల్వంచ : ఆరుగాలం కష్టపడి సాగుచేస్తున్న రైతులను పంట చేతికొస్తున్న సమయంలో మురసు తుఫాను భయపెడుతున్నది. ఎన్‌లోనినో ప్రభావంతో దంచి కొట్టిన ఎండలను తట్టుకొని సాగు చేసిన రైతన్నలకు మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా మారాయి. చేసిన అప్పులు తీరుతాయని ఆశపడ్డారు. వారి ఆశలకు గండి కొడుతూ అకాల తుఫానులు ఆగం చేస్తున్నాయి. మండలంలో ఆర్నాబ్ తుఫాను ఎఫెక్ట్ లేకపోయినా బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగండం మురసు తుఫానుగా మారి మంగళవారం ఉదయం నుండి కురుస్తున్న వర్షానికి చేతికొచ్చిన పత్తి పంట తడిసి పోవటమే కాకుండా చెట్టుపై కాయలు నల్లబడిపోతాయి. పత్తి నాణ్యతను కోల్పోతుంది. దీనితో రైతన్నలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొంది. సాగుకోసం అప్పుచేసి ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చుల భరించి పంటను కంటికి రెప్పలా పంటలను కాపాడుకుంటూ వచ్చిన కర్షకులకు తుఫాను ఆవేదనలో ముంచుతోంది. సాగు కోసం పెడుతున్న పెట్టుబడులు పెరుగుతున్నాయి. కూలీల కొరత వేధిస్తున్నది. దీనికి తోడు ఆశించిన మేర దిగుబడులు లేకపోవటం, గిట్టుబాటు ధరలు లభించిక సమతమవుతున్న సమయంలో చేతికందే సమయంలో వర్షాలు రావటంలో ఏడాది కష్టం వృధా అవుతుందని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు.

పేదల వైద్యం, విద్యకు ప్రభుత్వం పెద్దపీట

-రూ 45.50 కోట్లతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం
-నాణ్యతతో నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి : మంత్రి పొంగులేటి







ప్రజాపక్షం/కూసుమంచి: పేదలకు నాణ్యమైన వైద్యం, విద్య అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం గంగబండ తండా వద్ద రూ 45.50 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మొదటి బ్లాక్‌లో స్లాబ్ సెంట్రింగ్, స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులు, రెండో బ్లాక్‌లో స్లాబ్ పనులు పూర్తి కాగా, కాలమ్ కాంక్రీట్ పనులు జరుగుతున్నట్లు అధికారులు వివరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు అనారోగ్యం వస్తే ఆర్థిక ఇబ్బందులతో వైద్యానికి దూరమయ్యే పరిస్థితి లేకుండా ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. అన్ని నియోజకవర్గాల్లో అవసరమైన చోట 100 పడకల ఆసుపత్రులు, మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ఆసుపత్రుల అవసరాలకు అనుగుణంగా వైద్యులను కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందేవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ వైద్య రంగానికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. పర్యటనలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, ఖమ్మం ఆర్టీఓ ఎన్ శ్రీనివాస్, వైద్యశాల ఈఈ టీ ఉమామహేశ్వరరావు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బ్లాక్ మార్కెట్‌ను అరికట్టండి : సలాం



ప్రజాపక్షం/ ఖమ్మం : నిత్యావసర వస్తువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బందులు పడుతున్న ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. లెనిన్‌నగర్‌లో ఎస్‌కె చానా అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో సలాం మాట్లాడుతూ ప్రభుత్వ ఉదాసీన వైఖరి కారణంగా వ్యాపారులు రెచ్చిపోతున్నారన్నారు. అక్రమ నిల్వల ద్వారా కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్నారన్నారు. బ్లాక్ మార్కెట్ నిల్వలపై దాడులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు సాంబశివరెడ్డి, జ్వాలా నర్సింహారావు, రెహ్మాన్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ గోదాములను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

-ఐసిఎం ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్యామ్‌కుమార్



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గిట్టుబాటు ధర లేనప్పుడు రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వ గోదాములను సద్వినియోగం చేసుకోవాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ శ్యామ్‌కుమార్ సూచించారు. మంగళవారం రఘునాథపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో గిడ్డంగి అభివృద్ధి సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో రైతులు, వ్యాపారులు, మిల్లర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఎన్నో కష్టనష్టాలకొర్చి పంటలను పండిస్తే బహిరంగ మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో సరైన ధర లేనప్పుడు ఉత్పత్తులను విక్రయించుకోకుండా ప్రభుత్వ గోదాముల్లో భద్రపర్చుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనార్థం కోట్ల రూపాయల నిధులు వెచ్చించి నిర్మించిన గోదాముల గురించి ఇప్పటికీ చాలా మంది రైతులకు అవగాహన లేకపోవడం శోచనీయమన్నారు. గోదాముల్లో నిల్వ చేసుకునే ధాన్యానికి ఒక్కో బస్తా పై నెలకు కేవలం నామమాత్రపు రుసుము మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని, మంచి ధర పలికినప్పుడు విక్రయించి లాభపడవచ్చునని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, సహకార అధికారి మహికుమారి, సర్పంచ్ గాజుల కృష్ణారావు, సొసైటీ కార్యదర్శి మద్దినేని వెంకటేశ్వర్లు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : మురసు తుఫాను ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ముందున్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. తుఫాన్ ప్రభావంతో రెడ్ అలెర్ట్ ప్రకటించిన నందున అధికార యంత్రాంగం సమన్వయంతో ముందుసు సాగాలని సూచించారు. జిల్లాలో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం జిల్లా అధికారులతో టెలీకాన్ఫిరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, నిధిలావస్థకు చేరుకున్న ఇళ్లలో నివశిస్తున్న వారిని అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 94 ప్రమాదకర రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని వాగులు వంకలు పొంగిపొర్లే ప్రాంతాల్లో రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. పాత వంతెనలు కల్వర్టులు డ్రైనేజీలను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు గానూ కొత్తగూడెం ఐడిఓసి కార్యాలయంలోనిని ఎఫ్ 28గదిలో 24గం.ల పాటు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అత్యవసర సహాయం కోసం 08744 241950, 9392919743, భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 08743232444 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. చర్ల దుమ్ముగూడెం మణుగూరు పినపాక మండలాల్లో తేలికపాటి వర్షాలు అశ్వారావుపేటలో మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

జూలూరుపాడులో వానర స్వైరవిహారం

-గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వానరాలు
-భయం గుప్పిట్లో బతుకుతున్న ప్రజలు
-వానరాల బెడద అరికట్టాలని విన్నపాలు







ప్రజాపక్షం/జూలూరుపాడుః ఒకప్పుడు అడవులకే పరిమితమైన వానర సైన్యం, ఇప్పుడు గ్రామాల్లో తిష్ట వేశాయి. జూలూరుపాడు మండల పరిధిలోని పలు గ్రామాలు ఇప్పుడు కోతుల గుంపులతో యుద్ధం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి పీడిస్తున్న ఈ సమస్య పై పాలకులు మారుతున్న, పరిష్కారం మాత్రం లభించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వానరాల గుప్పిట్లో గ్రామాలు..

జూలూరుపాడు మండల కేంద్రంతో పాటు మండలంలోని ప్రధాన గ్రామాల్లో కోతుల తాకిడి విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా జూలూరుపాడు, పాపకొల్లు, కాకర్ల, గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కోతులు బీభత్సం సృష్టిస్తున్నాయి. గతంలో ప్రతి ఇంట్లో పెరటి తోటలు, కూరగాయలు, పండ్ల మొక్కలు కళకళలాడేవి. కానీ ఇప్పుడు కోతుల భయంతో కనీసం ఒక్క మొక్కను కూడా పెంచలేని దుస్థితి ఏర్పడింది. కేవలం మొక్కలను నాశనం చేయడమే కాకుండా, ఇప్పుడు ఈ వానరాలు నేరుగా మనుషులపైనే దాడులకు తెగబడుతున్నాయి. చిన్నారులు బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. అడవులు అంతరించిపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణమని పర్యావరణవేత్తలు భావిస్తున్నారు. అడవుల్లో ఆహారం, నీరు లభించకపోవడంతోనే వానరాలు జనావాసాల్లోకి చొర బడుతున్నాయి. దీనికి తోడు అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించిందని, కోతులను తిరిగి అడవుల్లోకి పంపేందుకు లేదా వాటిని నియంత్రించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బయటకు వచ్చేందుకుజంకుతున్న జనం..

మండల పరిధిలోని పలు కాలనీలు, ప్రధాన కూడళ్లలో కోతుల గుంపులు పగలు, రాత్రి తేడా లేకుండా సంచరిస్తున్నాయి. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్న పిల్లలు, ఉదయం నడకకు వెళ్లే వృద్ధులు, మహిళలపై విరుచుకుపడుతున్నాయి. చేతిలో కవర్ పట్టుకొని ఒంటరిగా నడుచు కుంటూ వెళ్లే వారిని అడ్డగించి కరవడానికి వస్తుండటంతో కాలనీవాసులు బయటకురావాలంటేనే వణికి పోతున్నారు.

భారీ ప్రమాదాలు జరగకముందేస్పందించాలి..

ఇటీవల వానరాల దాడులు పెరుగుతున్న వాటి గురించి పట్టించుకునే నాథుడే లేడు అంటూ స్థానిక ప్రజలు తమ ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. ఏదైనా భారీ ప్రమాదం జరిగి, నష్టం జరిగిన తర్వాత స్పందిస్తారా? అని అధికారులను నిలదీస్తున్నారు. మండల పరిధిలో విచ్చలవిడిగా తిరుగుతున్న వానరాలను అరికట్టడానికి ఇప్పటికైనా ఉన్నతాధికారులు మరియు పాలకులు స్పందించి, జూలూరుపాడు మండల ప్రజలను ఈ కోతుల భయం నుండి విముక్తులను చేయాలని, తగిన పరిష్కారం చూపించాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం..

ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రాణాలు పోయే వరకు ఎదురుచూస్తారా? అని స్థానిక ప్రజలు నిలదీస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, హామీలు ఇస్తున్నా అమలులో మాత్రం శూన్యమని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ జిల్లా యంత్రాంగం స్పందించి, కోతుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో కోతులను బంధించి సురక్షితమైన అడవి ప్రాంతాలకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.